# క్రిస్మస్ లేఖ

[కథానిక]

●

శ్రీ కె. అన్నమరాజశర్మ

అది చలికాలము. పుష్యమాస మపుడే పొడసూపి, హేమంత ప్రౌఢిని మూడుకాళ్ల ముదుసళ్లపై, బట్టలు లేని బీదలపై జూపుచుండెను. మిరపతోటలలో రంగురంగుల బంతిపూలు చాళ్లంట విరుగబడి నవ్వుచుండెను. కాయగసరులు ఫలింప పంటపొలములు సస్యశ్యామలములై కన్నుల విందు గొలుపుచుండెను. కమలాపురము మూడువేల జనాభా గల మోతుబరి గ్రామము. వట్టుజనాభాలో మూడవవంతు క్రీస్తుమత మవలంబించిన ఆదిమాంధ్రులు. ఆ మతస్థులలో రెండుశాఖలవారికి రెండు వేర్వేరుగుళ్లున్నవి. క్రిస్మస్ పండుగ యింకా వారందినాలుండగానే చదువుకొన్న క్రైస్తవులు ప్రవాసములు వదలి క్రిస్మస్ శెలవులు గడపుటకై కమలాపురం చేరుకొనిరి. క్రైస్తవులైన పాటక జనం పండుగఖర్చులకై వేరుశనగకాయ యేరి, ఆకు కుప్ప వేసి, యింకా యితరమైన కూలినాలిపనులు చేసి, "రేపురా, మాపురా" అనే రైతుల యిళ్లచుట్టూ డబ్బుకై ప్రదక్షిణం చేయుచుండిరి. ఏకాస్తనో భూవసతి గల క్రైస్తవరైతులుమాత్రం మహసూలు(పంట)ను విక్రయించి, ద్రవ్యము చేసికొని పండుగకై యెదురుచూచుచుండిరి. ఇరుతెగలవారి ప్రార్థనా మందిరములు వాని గోపురములతో సహా చలువచేయబడెను. ఇక రెండురోజులుమాత్రమే వ్యవధి యుండెను. క్రైస్తవోపాధ్యాయులు క్రిస్మస్ వేడుకలు జరిపించుటకై గ్రామమందలి పెద్దరైతులను దర్శించి, చందాలు ప్రోగుచేయుచుండిరి. సర్వమతసహానం గల ఆగ్రామరైతులు యథోచితంగా చందాలువేసిరి.

మరునాడు క్రిస్మస్ పండుగ. అది ఆ బీదజనుల కానందముగూర్చు పుణ్యోత్తరదివసము. నాడు రోజ్ మేరీ సంజపడకమున్న, పంటపొలాలనుండి తొందరగా వచ్చి, గ్రామములో రావలసిన కూలీరూకలకై యిళ్లవెంట తిరిగితిరిగి, యేడురూపాయలు మాత్రం సంపాదించినది. రోజ్ మేరీ ఆగ్రామమున పుట్టినదే. ఆమె పూర్వనామము నాగమ్మ. చిన్ననాడే తల్లిదండ్రులు గతించుటచే పరపోషణవల్ల విద్య సాగక ప్రాథమికవిద్యతోనే గట్టెక్కినది. ఆమె అందగత్తెనేకాని, అమాయికురాలు. ఈడు మాడ పదునాల్గేండ్లు దాటి దాటక.

ఆకాంక్షించిన క్రిస్మస్ పండుగ శుభోదయమగుగాక యని యమరసందేశముం దెచ్చిన రాయబారివలె బాలభానుడుదయాద్రిపై పసిడివన్నె లొలికించుచుండెను. రోజ్ మేరీయిల్లు చుట్టాలతో నిండియుండెను. రోజ్ మేరీ కొక గేదెమాత్ర మున్నది. ప్రతిదినం తన కూలిపనులతోపాటు గేదకు మేతసైతం సేకరించి, యింటికి తెచ్చుట వాడుక. క్రిస్మస్ నాడు వరువాతనే రోజ్ మేరీ లేచి, అభ్యంగనం చేసుకొని ముక్తకేశియై గ్రామాని కనతిదూరమందున్న రామానాయుడిపొలములో గడ్డికోయుటకై పోయెను. వెంకటరాముడు రామానాయుడి పొలముకాపు; యువకుడు; అతడు పొలంలో రోజ్ మేరీ ఒంటరిగా తిరుగులాడటం చూచి చేయిపట్టి లాగినాడు. ఇరువురు పరస్పరదూషణలతో రామానాయుడిదగ్గరకు వచ్చారు. రామానాయుడు యేదో మనస్వాస్థ్యము లేక మేడపై యేకాంతపుటాలోచనలో మగ్నుడైయుండెను. రామానాయుడు మంచివాడేకాని, కోపము దాపురించినపుడు దుర్వాసుడే! అపుడు మంచిసెబ్బగలు కొంచెంకూడ ఆలోచింపడు. ఒక్క రామానాయుడు మాత్రమే కాదు, కోపోద్రేకమున మానవజాతే సామాన్యంగా వివేచనం కోలుపోతుంది.

రోజ్ మేరీ నాయుడిగారి పొలంలో దొంగతనం చేయుచుండగా పట్టుకొనివచ్చినానని నౌకరు

వెంకటరాముడు ఫిర్యాదుచేసినాడు. రోజ్ మేరీ 'సత్యముగా నే నట్టి పనిచేయలే' దని నొక్కినొక్కి చెప్పి యేడ్చినది. సత్యాసత్యవిమర్శనతతంగం కొంత సేపు జరిగినది. కాని, రామానాయుడు వెంకటరాముని మాటలు నమ్మి గభాలున కుర్చీపైనుండి లేచి, కోపము త్రాచుపామువలె విజృంభింప, మూడునాల్గు దెబ్బలు రోజ్ మేరీచెంపలు కంద వేసెను. ఇంకా కోపం పెరిగిపోతూవుండగా వెంకటరాముడే చూడలేక, యజమానుని వేడుకొన్నాడు. దెబ్బల గుర్తులు చెక్కు లెఱ్ఱవడ రోజ్ మేరీముఖమున ముద్రింపబడెను. వాని నాచాన తుడుచుకోనైన లేదు. సంతతధారగా కన్నీరు మాత్ర మొలికించినది. "చెప్పు దెబ్బలు చాలునా, కేసుకూడా పెట్టమంటావా" అని రామానాయుడు గద్దించి కన్ను లెఱ్ఱచేసి అడిగినాడు. ప్రేక్షకజనం రోజ్ మేరీ తిన్న దెబ్బలు చాలక మళ్లా కేసెందులకు లెమ్మని రామానాయుడిని సమాధానపరచి, రోజ్ మేరీని యింటికి పంపివేసినారు. రోజ్ మేరీచెక్కులు చూచి, "రామానాయుడు కఠినాత్ముడని కొందరు, యేమో కిరస్తాని పిల్ల దొంగతనం చేసియుండవచ్చు, తగిన శాస్తి కుదిరిందిలే" యని కొందరు, పలువిధాల తలపోసిరి. లోకులు పలుగాకులనుట యిట్టిదే నేమో. క్రైస్తవులలో కొందరు రామానాయుడుపై కేసు పెట్టదలచిరి. కాని ఏదీ సాక్ష్యం? కర్మసాక్షిమాత్రమే చెప్పదగిన సాక్షి! ఊళ్లో రామానాయుడి పేరు చెప్పిన హడల్. ఇక విరోధించి బ్రతుకువా రెవ్వరు? సాక్ష్యం నిల్చినా ద్రవ్యం గుమ్మరించి, సాక్షులను అధికారులను స్వవశం చేసుకొంటాడు. ఇక గత్యంతరం యేముంది?

క్రైస్తవులలోని కొందరు పెద్దలు "క్రిస్మస్ పండుగరోజు యెంతమాత్రం కేసుపెట్టకూడదు. మన ప్రభువు పుట్టిన పుణ్యదినమున మనం త్యాగపూరితులమై క్షమాబలంతో ఉండాలి. కుడిచెంపదెబ్బకు యెడమచెంప కూడా అందీయవలెగాని అన్యథా వద్దు. ఎప్పటికీ వద్దు." అని సలహా లిచ్చిరి. రామానాయుడికడకు పోయి కడ కీసంగతినైన విచారించుదామని తలచిరికాని, అయిపోయిన పెళ్లికి మేళ మెందుకు లెమ్మని కొందరు, 'గతగోష్ఠి నకర్తవ్య'మ్మని కొందరు ప్రక్కతాళములు వేసిరి. వచ్చిన చుట్టపక్కాలు రోజ్ మేరీకి జరిగిన అవమానమునకై యెంతో చింతించిరి. కాని, వా రేమి చేయగలరు? బంధువులతో రోజ్ మేరీ "యేమోలెండి, నాయుడుగారికి దేవు డాబుద్ధి ప్రేరేచినాడు. వా రేమి చేయగలరు? అంతయు జగత్పితయగు దేవుని చిత్తము కాదా" అని తానే వారి నోదార్చెను.

రామానాయుడు రోజ్ మేరీని కొట్టిన రెండు మూడు నిమిషాలకు ఆదినం క్రిస్మస్ పండుగ అని గ్రహించెను. రామానాయుని హృదయాకాశంలో చీకటి తెరలు జీల జ్ఞానసూర్యు డపుడే పొడచూచుచుండెను. అతని స్మృతివీథిలో రోజ్ మేరీతక్క అన్యము గోచరింపదు. అతని చిత్త మిపుడు పశ్చాత్తాపముచే తప్తము కాజొచ్చినది. రామానాయుడు తనలో తాను "కొట్టినవాడను నే నేల కొట్టితిని? అందరు పండుగలో భాగస్వాములై యానందమొందుచుండ, వెంకటరాముని మాట నమ్మి రోజ్ మేరీని కొట్టి, అవమానపరచితినే? దీని కేమి పరిహారము? నాకడుపునిండ పిల్లలున్నారే. రోజ్ మేరీసైతము నాకూతురు విశాలవంటిది కాదా? ఎంతపని చేసితి! ఎంత చెడ్డదినము! అయ్యో దైవమా! నేను నీదృష్టిలో క్షంతవ్యుణ్ణి కాను. కాను - ఎన్నటికి గాను. పాపమున కనుభవమే పరిహారము. కర్మదేవతకు పక్షపాతము లేదు. ఉండ కూడదు. రోజ్ మేరీ, నీవే నన్ను కరుణించి క్షమించవలెను. నీకుమాత్ర మెట్లు కరుణ కలుగును రోజ్ మేరీ! ఓ రోజ్ మేరీ" అని నిట్టూర్చుచుండెను. అతని హృదయకుహరమునుండి పాషాణముల గరగించు దివ్యకరుణాతరంగిణి సహస్రపథగామినియై ప్రవహింపజొచ్చినది. అప్పు డొంటరిగా రోజ్ మేరీయే యుండిన పాదములంటి క్షమాభిక్ష వేడియుండును. రోజ్ మేరీయింటికి పోయి క్షమింపుమని ప్రార్థింత మనుకొన్న గ్రామంలో మరీ చేలతనం. చేసిన దుష్కృత్యమా క్షంతవ్యము కానిది. దైవక్రోధమునకు గురికావలసినది.

పగ లెల్లో యుగముగా గడచెను. కాని యొక ఆలోచనాజ్యోతి చిత్తమును వెలిగించెను. రామానాయున కొక మిషన్ ఉపాధ్యాయుడు ముఖ్యుడు. అతని పేరు లాజరస్. అతడు పెద్దమనిషి. అంతే కాదు: నీతిమంతుడు. రాత్రి తొమ్మిదిన్నరగంటలకు లాజరస్‌ను తక్షణం వచ్చిపోవలసినదిగా రామానాయుడు సేవకునిచే కబురుచేసి పంపినాడు. అపుడు లాజరస్ బాణసంచా కాల్చుటలోను, యితరములైన వేడుకలందును నిమగ్నుడైయుండెను. అందుచే రామానాయుడి పిలుపు శీఘ్రము నిర్వర్తించుటకు లాజరస్‌కు వీలుకాదయ్యె. "ఈ రాత్రివేళ యెందులకా" యని లాజరస్ తనలో తాను హేతువు లరయుచుండెను. అయినది కానిమ్మని లాజరస్ కొంతతడవునకు రామానాయుడి మేడపైకివచ్చెను. రామానాయుడు లాజరస్‌ను చూచినతోడనే వెదకబోయిన తీగయే యెదురుపడిన చిత్తవృత్తిని రమ్మని యాహ్వానించెను. ఆహ్వానములందు సైతము కార్యప్రయోజనముల ననుసరించి గౌరవతారతమ్యము లుండునుగదా! రామానాయుడు "లాజరస్! చెప్పుటకే నామనస్సు వ్రక్కలగుచున్నది. సర్వ క్రైస్తవప్రపంచమునకు శుభప్రదమైన నేటిదినము నా జీవితమునకే మహత్తరదుర్దినమైనది. నీకు తెలియ లేదా లాజరస్" అని విచారభారమునం బలుక, లాజరస్ "నాయుడుగారూ, గతమును చింతించి యేమి లాభము? మీరు త్రికరణశుద్ధిగా పశ్చాత్తాపము జెందుచుంటిరేని, దేవుని ప్రియకుమారుడైన జీసస్ ప్రభు వనుగ్రహించు ననియే మా పవిత్రగ్రంథమగు బైబిలు చెప్పుచున్నది."

రామానాయుడు:- అది నేను చెప్పలేనుగాని, నా యంతరాత్మ యీదుష్కార్యాచరణమున కెంత తపించుచున్నదో చిత్తవృత్తుల గొలుచు సాధనము లున్న చూపించియుండెడివాడను లాజరస్.

లాజరస్:- నాయుడుగారూ, రోజ్ మేరీని తమ తావుకు తీసికొనివస్తాను క్షమించమని అడుగుతారా?

రామానాయుడు:- తప్పకుండా అడుగుతాను. కాని ఆపిల్లను ఒంటరిగా నీతో తీసికొనిరా. ప్రక్కన యెవ్వరైన వుంటే యేం బాగు?

లాజరస్:- అదెందులకు? తమకు నిజమైన పశ్చాత్తాపం వుంటే యెవరుంటే నేమి? క్షమాభిక్ష కోరడం అవమానమా? పాపం చేయడం అవమానం కాదా?

రామానాయుడు:- తొందరగా వెళ్లి పిలుచుకొనిరా. రాకపోతే - బతిమాలి, ఆశలు కల్పించి, తీసికొనిరా. మీకోసం ఎదురుచూస్తూవుంటాను. వెళ్లు లాజరస్, వెళ్లు.

అనగా లాజరస్ శెలవుపొంది కొంతసేపటికల్ల రోజ్ మేరీతో హాజరయ్యెను. రోజ్ మేరీముఖదర్శనమున రామానాయుడి మనఃకమలము ప్రఫుల్ల మయ్యెను. రామానాయుడు రోజ్ మేరీతో "నేను త్వరపడి, వివేచనం చేయక, అమాయికపు పిల్లవైన నిన్ను, తల్లి దండ్రులులేని బీదరాలవైన నిన్ను, నిష్కారణముగా క్రిస్మస్ అనియైన సంకోచింపక, నేడునయం దేనితో ని న్నవమానపురస్సరముగా దండించితినో - అది ఇదిగో. నాపై ద్విగుణీకృతముగా ప్రతీకారచర్య జరిపించు. లేదా నా యపరాధమున కేదేని ద్రవ్యరూపపరిహారము విధించి, స్వీకరించి నన్ను క్షమింపుము." అనెను.

రోజ్ మేరీ:- క్షమించుటకు నే నెంతటిదానను? తమ దెబ్బలపై జీవించు పురుగులలో నే నొకదానను. తా మంత పలుకు పలుకనేల? నే నీ దినం వుదయం యెవరి మొగము చూచినానో, తమ కింతటి ప్రళయరుద్రకోపం ఆవేశించింది. అందుకు మీ రేమి చేయగలరు?

రామానాయుడు:- అయితే నన్ను క్షమింపవా? నన్ను క్షమింపవా? నా హృదయపూర్వకముగా అర్థించుచున్నాను.

రోజ్ మేరీ:- క్షమాపణ మర్థించువారు ద్రవ్యరూపమైన కానుకల నాసపెట్టుదురా? పోయిన నా యాత్మగౌరవ మిహలోకమందలి యేపదార్థము చేతను పూరింపబడదు. మీరు విచారపడకుడు.

రామానాయుడు:- అయితే రోజ్ మేరీ, నా కింతేనా? క్షమాభిక్ష లేదా?

రోజ్ మేరీ:- నే నేమియు చెప్పలేను. అంతయు ప్రభుచిత్తమే.

రామానాయుడు:- ఏ దయామయుడు లోకశ్రేయమునకై భూమిని రక్తసిక్తము గావించెనో, అట్టి యేసునాథుని పేరనైన నన్ను కనికరించి, నా తప్పు క్షమింపుము. ప్రభువు పేర నన్ను త్రికరణశుద్ధిగా క్షమించితి ననుము. నీవు నన్ను క్షమింపవేని, నిన్ను మాత్రము లోకైకపితయగు పరమేశ్వరుడు క్షమించునా? బ్రతుకుదెరువున నీవే తప్పుచేయలేదని చెప్పగలవా? రోజ్ మేరీ! మానవపాపపరిహారణార్థమై నీ మతప్రవక్త యేసుక్రీస్తువే యూదులు తన్నీలెలతో రుధిరమొడికట్ట ప్రక్కపోట్లు పొడుచుచున్నను, వారిం గరుణింపుమని- తెలియక చేయుచున్నారని యర్ధనిమీలితాక్షుడై శిలువపైనుండి భగవంతుని ప్రార్థించిన కృపాప్రపూర్ణవచనాల నొక్కసారి నీహృదయఫలకాన నొత్తికొనుము. ఆ దివ్యకృపాసందేశమే! నేటికి! క్రిస్మస్ లేఖగా నీ మ్రోల చదువుచున్నా ననుకొనుము.

అని సదయశీతలవాక్కులం బల్క ప్రక్కనున్న లాజరస్ సైతము క్షమింపుమని హితవొసంగెను.

రోజ్ మేరీ ప్రవర్తన కపటమెఱుగనిది. మరునాడు ప్రార్థనాసమయమున రామానాయుని తన నిమిత్తమై క్షమింపుమని తమ చర్చిలో మనసార ప్రార్థించెను. రామానాయుని చిత్తము యెండిపోయిన కసవుపైబడు వానచినుకులవలె కందళించెను. నాటనుండియు రామానాయుడు పలుమారు 'కోపము తాపముచేటు- తాపము బ్రహ్మహత్యచేటు' అని తన్ను చూడవచ్చినవారితో పల్కుచుండువాడు. నాటనుండియు రామానాయుడు తీవ్రకోపమునకుగాని, యొరులను చేయెత్తి దండించిన పాపమునకుగాని లోనై యెరుగడు.

